క్లుప్తంగా

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న ప్రజలు

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు అనుబంధ గ్రామమైన ఎంపీసీ నగర్ సమీపం లో కూటమి ప్రభుత్వానికి చెందిన కొందరు వ్యక్తులు ఇసుక తవ్వడానికి జేసీబీ, టిప్పర్లతో వెళ్లగా ఎంపీసీ నగర్ కాలనీ వాసులు అడ్డుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే తవ్వుకోమన్నాడంటూ వారు తెలుపగా, స్థానికులు ఎమ్మెల్యేకి ఫోన్ చేసి విషయం తెలిపారు. అయితే, తవ్వకాలకు వచ్చిన వారిపై కేసు పెట్టాలంటూ ఆయన సూచించినట్లు సమాచారం అందడంతో చేసేది లేక టిప్పర్లు, జేసీబీలతో తవ్వకందారులు వెనుదిరిగారు.

50 శాతం సబ్సిడీతో షేడ్‌నెట్ యూనిట్లు

ఒంగోలు వన్‌టౌన్: షేడ్‌నెట్ యూనిట్లను 50 శాతం సబ్సిడీతో రైతులు పొందవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ తెలిపారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీ సెంటర్‌లో సోమవారం షేడ్‌నెట్ అధికారులు, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 525 చదరపు మీటర్ల పరిమాణం కలిగిన షేడ్ నెట్ ద్వారా 365 రోజులు వ్యవసాయం చేసుకుని రాబడి పొందవచ్చన్నారు. 50 శాతం సబ్సిడీ, మిగిలిన 50 శాతం కూడా వెలుగు నుంచి రుణం మంజూరు చేస్తామన్నారు. సెర్ప్ షేడ్ నెట్ భాగస్వామి ఖేతి సంస్థ ప్రతినిధి కృపాసత్యం మాట్లాడుతూ రైతు భాగస్వామ్యం అందిన వెంటనే షేడ్‌నెట్‌ను వెంటనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక సంవత్సరం పాటు పంటలకు అన్ని రకాల ప్రోత్సాహకాలు ఉంటాయని, అదే విధంగా మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామని అన్నారు. సమావేశంలో వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ ప్రాముఖ్యత పెరుగుతోంది

ఒంగోలు టౌన్: సమాజంలో రోజురోజుకూ ఫిజియోథెరపీ ప్రాముఖ్యత పెరుగుతోందని, సంపూర్ణ ఆరోగ్యంలో భాగంగా వైద్యుల సలహాలను అనుసరించి ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఫిజియోథెరపిస్టుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని చర్చి సెంటర్ నుంచి మినీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీజీహెచ్‌లోని సీఎంఈలో జరిగిన సభలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఫిజియోథెరపిస్టులు తమవంతు పాత్రను సమర్థవంతంగా పోషించాలని సూచించారు. ఫిజియోథెరపీ రంగంలో తాజా పరిణామాలు, ఎదురయ్యే సవాళ్ల గురించి ఫిజియోథెరపీ సంఘ నాయకులు చర్చించారు. ఫిజియోథెరపీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డా.ఎస్.కిరణ్, కళాశాల ప్రతినిధి సుబ్బలక్ష్మి, సంజీవరెడ్డి, నిర్వాహకులు అయ్యప్ప, ఆంజనేయకుమార్, శ్రీకాంత్, చంద్రశేఖర్, సుధాకర్, రాజ్‌కుమార్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా విద్యనభ్యసించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): ప్రతి ఒక్క మహిళా విద్యనభ్యసించాలని అడల్ట్ ఎడ్యుకేషన్ ఏపీవో ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ మహిళలు చదువుకోవడం వలన అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంఈఓ వెంకారెడ్డి, బాబూరావు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

కృష్ణ బలిజ సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీనివాసరావు



తిర్లక శ్రీనివాసరావును అభినందిస్తున్న బొట్ల సుబ్బారావు

ఒంగోలు వన్‌టౌన్: కృష్ణ బలిజ సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా ఒంగోలుకు చెందిన తిర్లక శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని కృష్ణ బలిజ సంఘ కార్యాలయంలో ఈ ఎన్నికలు జరగ్గా.. సోమవారం ఒంగోలు వచ్చిన ఆయనను అభిమానులు, బీసీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి అభినందించారు. వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు బొట్ల సుబ్బారావు పాల్గొని శ్రీనివాసరావును అభినందించారు. తిర్లక గతంలో కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. కార్యక్రమంలో తిర్లక చెంచుబాబు, తన్నీరు సోమయ్య, తుపాకుల లక్ష్మీనారాయణ, పిగిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేయాలి

- వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపు



కొత్తపట్నంలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపట్నం: ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతులకు అండగా నిలిచేందుకు ఒంగోలు ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. కొత్తపట్నంలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద సోమవారం అన్నదాత పోరు కార్యక్రమ పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు అన్ని విధాలుగా సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. ఇందుకు నిరసనగా పార్టీ పిలుపు మేరకు ఒంగోలు ఆర్డీవో కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. మండలంలో మూడు వంతుల మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎరువుల కొరత లేకపోగా, గిట్టుబాటు ధరలు, మార్కెట్ సౌకర్యంతో రైతులు ఆనందంగా జీవించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి నేరుగా రైతులకు ఎరువులందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి అందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సాగుచేస్తున్న ప్రతి పంటకు బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి మండలంలోని పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రరెడ్డి, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, రాజుపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరరావు, గుండమాల సర్పంచ్ కారాని జయరావు, వెంకటసుబ్బారావు, తంబి కాంతారావు, ద్వారం మురళి, గాలి మునలారెడ్డి, తంబి వెంకటేశ్వర్లు, పురిణి బ్రహ్మారెడ్డి, తాతా నాంచార్లు, రంగయ్య, ద్వారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మారెళ్ల బంగారుబాబు

చీమకుర్తి మండలం నుంచి తరలిరావాలి...

చీమకుర్తి రూరల్: అన్నదాతకు బాసటగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి చీమకుర్తి మండలం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించే కార్యక్రమం ఉదయం 10 గంటలకు జరుగుతుందని, మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్నదాత పోరును జయప్రదం చేయాలి

- వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల బంగారుబాబు

నాగులుప్పలపాడు: రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగానికి ఎరువులు అందుబాటులో లేకపోవడం, పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతాంగంపై కూటమి ప్రభుత్వం కుట్రలు చేయడానికి నిరసనగా పార్టీ పిలుపు మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు ఒంగోలు ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల బంగారుబాబు కోరారు. సోమవారం నాగులుప్పలపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ చేతగానితనంపై నిలదీయడానికి, రైతులను నిలువునా ముంచిన ఈ చేతగాని ప్రభుత్వ తీరును ఎండగట్టడానికి రైతులు కదంతొక్కాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. విలేకరుల సమావేశంలో పార్టీ రైతు విభాగం మండల అధ్యక్షుడు తగిరిశ సుబ్బారావు, నాయకులు జెట్టి శ్రీనివాసరావు, పాలేరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన వ్యక్తి భార్యకు ఉద్యోగం



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: హత్యకు గురైన వ్యక్తి భార్యకు ప్రభుత్వ ఉద్యోగమిస్తూ నియామకపత్రాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం అందించారు. 2020వ సంవత్సరంలో పేర్నమిట్టకు చెందిన చింతగుంట్ల జీవన్‌ను అదే ప్రాంతానికి చెందిన అగ్రకులస్తులు హత్య చేశారు. శవాన్ని గుర్తుపట్టకుండా యాసిడ్ పోశారు. అప్పటి సీఐ అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా యాక్సిడెంట్ కేసుగా నమోదు చేశారు. దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు అప్పటి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో రెండు సంవత్సరాల తర్వాత అన్‌డిటెక్టడ్ కేసుగా నమోదు చేశారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం ప్రకారం బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఎస్సీ, ఎస్టీ పెన్షన్, రూ.8,25000 రిలీఫ్ మంజూరు చేశారు. ఆయా పత్రాలను జీవన్ భార్యకు అందజేశారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, కలెక్టరేట్ ఏఓ రవికుమార్, మెజిస్టీరియల్ సూపరింటెండెంట్ సాయి, మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు పరీక్షల్లో 29 మంది ఉత్తీర్ణత



బెల్టు పరీక్షలలో రాణించిన చిన్నారులు

ఒంగోలు: బెల్టు పరీక్షలలో పాల్గొని ఉత్తీర్ణత సాధించిన చిన్నారులకు జపాన్ కరాటే అసోసియేషన్ ఏపీ టెక్నికల్ డైరెక్టర్ కె.రఘునాథబాబు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు. సోమవారం స్థానిక దారావారితోటలోని నారాయణ ఒలంపియాడ్ స్కూలు ఆవరణలో జపాన్ కరాటే అసోషియేషన్ కరాటే బెల్టు పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 70 మంది ఈ పోటీకి హాజరుకాగా వారి నైపుణ్యాలను పరిశీలించిన అనంతరం 29 మంది వివిధ బెల్టులను దక్కించుకున్నారు. పోటీలు కోచ్ టి.జయశ్రీరెడ్డి ఆధ్వర్యంలో జరగ్గా నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ నిరూప్ సాయితేజ, క్లస్టర్ ప్రిన్సిపాల్ వాకా వేదవతిలు విజేతలకు శుభాకాంక్షలు తెలిపి మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు.

బాలికల విభాగం...

జె.జ్యోత్స్న, పి.లావణ్య, జి.రుద్రాణి, కె.హిమవాహిని, ఎ.ప్రణీత, బి.భవ్యశ్రీ, టి.హన్వితరెడ్డి, డి.హరికీర్తన, డి.హరినందన, జె.మోక్షిత, ఎస్.ధన్విశ్రీ, ఎం.పూజ్యశ్రీ, సి.బ్రహ్మణి, సీహెచ్ సాత్విక (జూనియర్-రెడ్ బెల్టు), భవిష్య (ఎల్లో బెల్టు), ధరణిశ్రీ భారతి (బ్లూబెల్టు), దేదీప్య (పర్పుల్ బెల్టు).

బాలుర విభాగం...

అంజన్, జి.హర్షవర్ధన్, ఎం.లీలాకృష్ణ, మోహిత్, జి.సాత్విక్, ఎస్వీ రుత్వికసాయి, జి.రిత్విక్, ఆర్.హరిహరన్, కె.రాజవిక్రమ్, సీహెచ్ తన్విక్ దేవా (జూనియర్-రెడ్ బెల్టు), పి.జ్యోత్స్న (గ్రీన్ బెల్టు).

గ్రామ కంఠంపై పొదిలి కమిషనర్ కన్ను

- అనాథరైజ్డ్ లే అవుట్ వాళ్లకు అప్పగించేందుకు కుట్ర
- గ్రూపు సభ్యులకు తెలియకుండానే డబ్బులు కాజేసిన వెలుగు సీసీ
- మీ కోసం కార్యక్రమంలో వెల్లువెత్తిన ఫిర్యాదులు



మీ కోసంలో కందులూరు డ్వాక్రా గ్రూపులో అక్రమాలపై జేసీకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొట్ల సుబ్బారావు, గ్రూపు సభ్యులు

ఒంగోలు సబర్బన్: పొదిలి నగర పంచాయతీ కమిషనర్ కేఎల్.నారాయణ రెడ్డి కన్ను రిటైరయిన ఆర్టీసీ డ్రైవర్ ఆధీనంలో ఉన్న గ్రామ కంఠం స్థలంపై పడింది. దాంతో 80 ఏళ్ల నుంచి ఇల్లు నిర్మించుకొని అనుభవంలో ఉన్న మా భూమిని (గడ్డను) జేసీబీతో తవ్వించి, చదును చేయించేందుకు కమిషనర్ పూనుకున్నాడని గుర్రం వెంకటేష్ మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని మీ కోసం భవన్‌లో సోమవారం ప్రజల నుంచి అర్జీలు తీసుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చేందుకు అర్జీదారులు వెల్లువెత్తారు. ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కావటం లేదని అర్జీదారులు వాపోయారు. ఈ సందర్భంగా పొదిలి నగర పంచాయతీలో 80 ఏళ్లుగా అనుభవంలో ఉన్న భూమిని కాజేసేందుకు అనధికారిక లే అవుట్ వేసిన వాళ్లతో కుమ్మక్కైన కమిషనర్ పథకం పన్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దాంతో పొదిలి తహశీల్దార్‌తో ఒక కమిటీ నియమించి సర్వే చేయిస్తామని డీఆర్‌ఓలో బి.చిన ఓబులేసు భరోసా ఇచ్చారు.

గ్రూపు సభ్యులకు తెలియకుండానే డబ్బులు కాజేసిన వెలుగు సీసీ:

గ్రూపు సభ్యులకు తెలియకుండా బ్యాంక్ ఖాతాల నిర్వహణ బాధ్యతలను మార్చేయడంపై బాధితులు సోమవారం మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. టంగుటూరు మండలం కందులూరు గ్రామంలోని కందులూరు-1 గ్రామైక్య సంఘంలో 25 స్వయం సహాయక గ్రూపులు సభ్యత్వం కలిగి ఉన్నాయి. గ్రామైక్య సంఘం అధ్యక్షురాలిగా బొట్ల వెంకట రమణమ్మ, కార్యదర్శిగా యు.వెంకట రావమ్మ, కోశాధికారిగా బి.సుశీలను ఎన్నుకుని బ్యాంక్ ఖాతాలను ప్రారంభించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వెలుగు సీసీగా ఉన్న చెన్నుపాటి కవిత 25 డ్వాక్రా గ్రూపులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో నకిలీ తీర్మానాలను సృష్టించారు. గ్రామైక్య సంఘ సభ్యులు కానివారి పేర్లతో నకిలీ పత్రాలు సృష్టించి కందులూరు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్లో అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న గ్రూపు సభ్యులు దాదాపు 50 మంది జేసీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన జేసీ గతంలో ఏపీ పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో వర కుమార్‌ను కలిసి ఆర్టీఐ ద్వారా సేకరించిన ఫోర్జరీ సంతకాల కాపీలు, తమ ఖాతాల అసలు కాపీలను అందజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. అదే విధంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణను కలిసి సీసీపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు విచారణాధికారి సక్రమంగా విచారణ చేయటం లేదని ఆరోపించారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి



రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ నిర్మలామణిని సన్మానిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: దేశ నిర్మాణంలో, వికసిత్ భారత్-2047 ఏర్పాటులో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కీలక భూమిక పోషించాలని స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబుతో కలిసి మూర్తి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్‌ను అభినందించారు. వాతావరణ సమతుల్యాన్ని కాపాడటానికి మొక్కలు నాటడం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు, సోషల్ అవేర్నెస్ క్యాంపులు, జాతీయ సమైక్యత దినోత్సవాలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని రిజిస్ట్రార్ హరిబాబు అన్నారు. ప్రస్తుతం ఏకేయూ పరిధిలో 58 యూనిట్లు ఉన్నాయని, మరో 60 యూనిట్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయని డాక్టర్ హర్షప్రీతం దేవ్‌కుమార్ వివరించారు. అనంతరం వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ నిర్మలామణి, తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఒక స్థలానికి ఒకే ఎల్పీఎం నంబర్ ఇవ్వాలి



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు: స్వామిత్వ కార్యక్రమంలో ఇంటి వివరాలు నమోదు చేసే క్రమంలో ఒక స్థలానికి ఒకే ఎల్పీఎం నంబర్ ఇవ్వాలని ఎంపీడీవో వి.జ్యోతి సూచించారు. మండలంలోని లింగంగుంట గ్రామంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులకు సోమవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ పరిశీలించి మాట్లాడుతూ స్వామిత్వ శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకుని అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్లు మాట్లాడుతూ గతంలో స్వామిత్వ కార్యక్రమంలో ఒకే స్థలంలో ఉన్న ఇంటికి రెండు మూడు ఎల్పీఎం నంబర్లు ఇచ్చారని, ప్రస్తుతం ఆ విధానాన్ని మార్చుకునేందుకు ప్రత్యేక సాంకేతికతను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. కొత్త సాంకేతికతను ఉపయోగించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లోని ఇళ్ల స్థలాల్లో ఒకే ఎల్పీఎం నంబర్ ఇస్తూ స్వామిత్వ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ఒకే స్థలంలో ఉండి వేరుబడిన కుటుంబాలకు సంబంధించి వేర్వేరు ఎల్పీఎం నంబర్లు ఇవ్వాలని తెలిపారు.

సబ్ డివిజన్ చేయాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న గ్రామస్తులు

కొత్తపట్నం: కలెక్టర్, తహసీల్దార్‌కు ఎన్ని సార్లు అర్జీలిచ్చినా సబ్ డివిజన్ ఎందుకు చేయడం లేదో సమాధానం చెప్పాలని కొత్తపట్నం గ్రామస్తులు సోమవారం స్థానిక తహసీల్దార్ శాంతిని ప్రశ్నించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో సర్వే నంబర్ 1429 బాధితులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని, ఇది మీకు ఎంత వరకు న్యాయమని అడిగారు. రెవెన్యూ రికార్డుల్లో అన్నీ ఉంటాయని, వాటిని చూడకుండా, సబ్ డివిజన్ చేయకుండా గ్రామస్తులను తిప్పుకోవడం మంచిది కాదని అన్నారు. వారం రోజుల్లో సబ్ డివిజన్ చేయకుంటే వచ్చే సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ స్పందిస్తూ పంచాయతీ సెక్రటరీ, ఎండోమెంట్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రెండు రోజుల్లో సబ్ డివిజన్ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోడూరి వెంకారెడ్డి, రాగాల విజయ్, తంబి కొండలు, పురిణి రాము, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడికి ఖండన

ఒంగోలు టౌన్: నగరంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర వినాయక విగ్రహం ఊరేగింపులో విధులు నిర్వహిస్తున్న ఎస్సై దాసరి శ్రీనివాసరావు, కానిస్టేబుల్ జి.రవికుమార్‌పై కొందరు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర పోలీసు అధికారుల సంఘ నాయకులు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ సీహెచ్ హజరత్తయ్య, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తిరుపతి స్వామి మాట్లాడారు. అసోసియేషన్ కో ఆప్షన్ సభ్యులు ఐ.మాల్యాద్రి, శ్రీదేవి, అహ్మద్ బాషా, మద్దిపాడు పోలీసు స్టేషన్ పీసీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కన్వీనర్‌గా ఆదినారాయణ

చీమకుర్తి: సీఐటీయూ చీమకుర్తి మండల కన్వీనర్‌గా శీలం ఆదినారాయణను సోమవారం ఎన్నుకున్నారు. రెండు రోజుల నుంచి చీమకుర్తిలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహిస్తున్న మండల స్థాయి సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. కన్వీనర్‌తో పాటు మరో 20 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా శ్రవణా నక్షత్ర వేడుకలు



పూజలందుకుంటున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్ర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. ఉభయదాతలుగా అప్పల జగదీష్, వెల్లంపల్లి నాగార్జున దంపతులు వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



బాలికలకు సైకిళ్లు అందిస్తున్న లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

చీమకుర్తి: లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలకు సైకిళ్లు, రెండు పాఠశాలలకు ఇడ్లీ పాత్రలు, మైకుసెట్‌లు అందించారు. నూతన అధ్యక్షునిగా చలువాది పార్థసారథి, కార్యదర్శిగా డాక్టర్ బీ జవహర్, కోశాధికారిగా ఎస్.అంజిరెడ్డిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంచే అంబటి సుధాకర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడు పార్థసారథిని సత్కరించారు. కార్యక్రమంలో చలువాది బదరీనారాయణ, డాక్టర్ బీ జవహర్, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ విజయకుమార్‌రెడ్డి, చలువాది రమేష్, స్థానిక సభ్యులు పాల్గొన్నారు.